13052024-MAI-06_Layout 1 5/13/2024 1:46 AM Page 1




# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# ఆ వ్యాఖ్యానాలు సాహిత్య దివిటీలు

**చరిత్ర పుటలను కొంచెం వెనక్కి తిప్పి పరికిస్తే... మెతుకుసీమలోని ఓ కుగ్రామం పేరు కొలిచలమ. ఆ ఊళ్లో ఒక సాధారణ గూన పెంకుల ఇల్లు. ఆ ఇంట్లో ఆ రోజు ఏదో పండుగ జరుగుతున్నది. ఇల్లంతా బంధువులతో కోలాహలంగా ఉన్నది. ఇక పూజా కార్యక్రమం ప్రారంభమైంది. ఆ ఇంటి కుటుంబసభ్యుడైన ఒక యువకుడిని సంబోధిస్తూ 'అయ్యా! పూజకు పూలు తెండి' అన్నాడు పురోహితుడు.**



'సరే.. ఇప్పుడే తెస్తా'నని చెప్పి పూల కోసం బయటకు వెళ్లాడు ఆ యువకుడు. అటూఇటూ చూశాడు. ఎదురుగా నిండుగా విరబూసిన మోదుగ చెట్టు కనిపించింది. వెంటనే గంపెడు పూలు కోసుకొని పురోహితునికి అందించాడు. ఆ పూలను చూసి తెల్లబోయాడు పురోహితుడు. 'మోదుగు పూలా! పూజకు పనికిరావే' అని అన్నాడు. ఆ యువకుడి తెలివితక్కువతనాన్ని చూసి బంధువులందరూ ముసిముసిగా నవ్వుకోసాగారు. అది గమనించిన ఆ యువకుడి భార్య ఎంతో నొచ్చుకుంది. ఆమె గొప్ప విద్వాంసురాలు. చివరాఖరికి ఎవరో తెచ్చిన పూలతో పూజ ముగిసింది. ఆ తర్వాత విందు ప్రారంభమైంది. విందులో తన భర్తకు ప్రత్యేకంగా చారును వడ్డించింది ఆ యువకుడి భార్య. అది రుచి చూసి 'అయ్యో ఇది చప్పగా ఉంది' అన్నాడా యువకుడు. దానికి జవాబుగా ఆయన భార్య ఒక శ్లోకం చెప్పింది.

చారు చారు సమాభాతం-
హింగు జీర సమ్మిశ్రితం
లవణ హీ నం న శోభన్తే-
పాలాశ కుసుమం యథాః

ఇంగువ, జీలకర్ర వంటి దినుసులు వేసి చిక్కటి రంగుతో చేసినా, పూజకు పనికిరాని మోదుగ పువ్వు వలె, ఉప్పు లేని చారు తినడానికి పనికిరాదని ఆ శ్లోకానికి అర్థం. అది విన్న బంధువులంతా పకపకా నవ్వసాగారు. తనకు జరిగిన అవమానాన్ని తట్టుకోలేని ఆ యువకుడు తింటున్న అన్నాన్ని విడిచిపెట్టి ఎటో వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆ పరిసరాల్లో ఎంత వెతికినా కనిపించలేదు.

కాలచక్ర పరిభ్రమణంలో కొన్నేండ్లు గడిచిపోయాయి. కనిపించకుండాపోయిన ఆ యువకుడు ఒకరోజు ఇంటికి తిరిగివచ్చాడు. అయితే ఇప్పుడాయన ఒక పండితుని వేషధారణలో ఉన్నాడు. తిరిగివచ్చిన భర్తను చూసి ఎంతో ఆనందపడింది అతడి భార్య. తన భర్త ఒక పండితుడయ్యాడని గ్రహించిందామె. ఒకనాడు తన తెలివితక్కువతనానికి పదిమందిచే పరిహసించబడ్డ ఆ యువకుడే, కాశీ నగరానికి వెళ్లి పండిత శుశ్రూష చేసి గొప్ప పండితుడై సంస్కృత భాషలోని మహా కావ్యాలకు అద్భుతమైన వ్యాఖ్యానాలు రాసి, వ్యాఖ్యాన చక్రవర్తి, పదవాక్య ప్రమాణ పారావార పారీణ, మహా మహోపాధ్యాయ బిరుదాలంకృతుడైన కోలాచల మల్లినాథ సూరి.

విద్యా విహీనుడి నుంచి మహా పండితుడిగా మారిన మల్లినాథుడి గురించి మరొక కథ కూడా ప్రచారంలో ఉన్నది. అదేమిటంటే.. 'పండిత కుటుంబంలో జన్మించినప్పటికీ, మల్లినాథుడికి చదువు అబ్బలేదు. అందువల్ల కుటుంబసభ్యులు ఆయనను పశువుల కాపరిగా వాడుకున్నారు. అయితే మల్లినాథుని స్వగ్రామమైన కొలిచలమ సమీపంలో ఉన్న తిరుమల్లయ్య గుట్టపై ఒక యోగి ఉన్నాడని తెలుసుకొన్న మల్లినాథుడు ప్రతిరోజు ఆ యోగిని దర్శించి, సేవలు చేసేవాడట. అందుకు సంతసించిన ఆ యోగి తన అవసాన దశలో మల్లినాథునికి మంత్రోపదేశం చేసి ఆయన నాలుకపై బీజాక్షరాలు రాశాడట. దాంతో ఆయనకు వనదుర్గాదేవి సాక్షాత్కారం లభించిందట. తర్వాత అమ్మవారి ఆశీర్వచనం తీసుకొని కాశీ క్షేత్రానికి వెళ్లి అక్కడి పండితుల వద్ద శిష్యరికంతో సకల శాస్త్రాలు నేర్చుకొని తిరిగి స్వగ్రామానికి వచ్చాడట. ఆ తర్వాత సంస్కృత మహా కావ్యాలకు వ్యాఖ్యానాలు రచించి వ్యాఖ్యాన చక్రవర్తి మల్లినాథ సూరిగా పేరుగాంచాడట'. సూరి అనగా పండితుడని అర్థం.

> **ఇక, ప్రచారంలో ఉన్న గాథల విషయం ఎట్లున్నా, మల్లినాథుడికి మొదట విద్యాగంధం అబ్బ లేదు. కానీ, కాశీపుర పండిత శిష్యరికంతో ఒక గొప్ప పండితుడయ్యాడన్నది ఈ రెండు గాథలు వెలువరించే సత్యం.**

మల్లినాథుడు క్రీ.శ.1350 నుంచి 1430 మధ్యకాలంలో జీవించాడని చరిత్రకారుల అభిప్రాయం. మొట్టమొదట ఆయనకు కాకతీయ రాజుల ఆదరణ లభించిందని, కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ఆయనకు రాచకొండ రాజుల ఆదరణ లభించిందని చెప్తారు. రాచకొండ రాజు సింగ భూపాలుడు ఆయనకు మహా మహోపాధ్యాయ బిరుదునిచ్చి సత్కరించాడు. అంతేగాక విజయనగర సామ్రాజ్య రాజైన ప్రౌఢ దేవరాయల ఆదరణ కూడా ఆయనకు లభించింది. ఆయన పుట్టి పెరిగిన గ్రామం మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని ఒకప్పటి కొలిచలమ. ఆ గ్రామం కాలాంతరంలో కోలాచలంగా, తర్వాత ప్రస్తుత కొల్చారంగా మారింది. ఇది మెదక్ నగర కేంద్రానికి 15 కి.మీ. దూరంలో ఉన్నది.

వ్యాఖ్యాన చక్రవర్తిగా బిరుదునందిన మల్లినాథుడు మహా కావ్యాలుగా పిలుచుకునే కాళిదాసు రచనలైన మేఘసందేశం, కుమార సంభవం, రఘు వంశాలకు సంజీవిని అని పిలువబడే వ్యాఖ్యానాలను రచించాడు. తర్వాత మహాకవి భారవి రచన కిరాతార్జునీయానికి ఘంటాపథమని, మాఘుని రచన శిశుపాల వధకు సర్వంకష పేరిట, శ్రీహర్ష చక్రవర్తి రచన నైషధీయానికి జీవాతువుగా, భట్టి కావ్యానికి సర్వపథీన వ్యాఖ్యానాలు రాసి ఖ్యాతిగాంచాడు. అంతేగాక ఒడిశాకు చెందిన విద్యాధరుని అలంకార రచన ఏకావళి శాస్త్రంపై తరళ, న్యాయశాస్త్రానికి సంబంధించిన వరదరాజు రచన తార్కిక రక్ష టీకాపై నిష్కంటక పేరిట రచనలు చేశాడు. ఇవేగాక రఘువీర చరితం, వైశ్య వంశ సుధాకరం, ఉదార కావ్యం, భక్తి రహస్యం, నక్షత్ర పాథ్యయం లాంటి సృజనాత్మక రచనలను కూడా చేశాడు. ఆయన వ్యాఖ్యానాల్లోని విశిష్ఠత గురించి 'ఇహాన్వయ ముఖేనైవ- సర్వం వ్యాఖ్యాయతే మయా నమూలం లిఖ్యతే-కించిన్నా నపేక్షితముచ్యతే' (మూలంలో లేనిది చెప్పను- అనవసరమైనదేదీ చెప్పను) అని స్వయంగా ప్రకటించుకున్నాడు. ముఖ్యంగా కువ్యాఖ్యల విష ప్రభావం వల్ల మూల కావ్యాలకు తీరని నష్టం జరిగిందని, దాన్ని సరిదిద్దేందుకే మల్లినాథుడు సువ్యాఖ్యానాలతో రచనలు సాగించాడని పండితుల అభిప్రాయం.

ఇన్ని రచనలు చేసిన మల్లినాథుడు దాదాపు ఎనభై ఏండ్లు జీవించాడు. జీవిత చరమాంకంలో కళ్లు తెరిచే ఓపిక లేకపోయినా కింది రెప్పకు తాడు కట్టుకొని, పై రెప్పకు కూడా తలపై నుంచి మరొక తాడు కట్టుకొని, దీపం ముందు కూర్చొని కావ్యాలు చదువుతూ, వ్యాఖ్యానాలు రాసేవాడని చెప్తారు. మల్లినాథుడి వ్యాఖ్యానాలు లేకపోతే సామాన్య ప్రజలకు, సంస్కృత కావ్యాలు అర్థమయ్యేవి కాదన్నది వాస్తవం.

తెలంగాణ సాహితీ, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచి తెలంగాణ ఖ్యాతిని నలుమూలలా చాటిన మహా పండితుడు, మల్లినాథ సూరికి తెలంగాణలో ఉమ్మడి పాలకుల కాలంలో తగిన గౌరవం లభించలేదు. కొల్చారం గ్రామంలో ఆ మహనీయుడు పుట్టి పెరిగిన ఇల్లు ఇప్పటికీ ఉన్నదని, ఆ ఇంట్లో ఆయన స్మారకార్థం ఒక వేద పాఠశాలను ఏర్పాటు చేయాలని తలచి 1981లో అప్పటి ప్రభుత్వం ఆ ఇంటిని కొనుగోలు చేసిందని కానీ, వేద పాఠశాల కార్యరూపం దాల్చలేదని తెలుస్తున్నది. అయితే మల్లినాథుని స్వగ్రామమైన కొల్చారంలో మల్లినాథసూరి సంస్కృత విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని 2023 మే 14న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించటం, అందుకు తగిన ఆదేశాలు జారీ చేయడం సాహితీ ప్రియులందరికీ ఆనందదాయకం. ఇక ఇప్పుడు ఏర్పడిన తెలంగాణ కొత్త ప్రభుత్వ సారథ్యంలోనైనా పండిత లోకం ఎన్నాళ్లుగానో కలలు గంటున్న ఈ సంస్కృత విశ్వవిద్యాలయం త్వరలో రూపుదిద్దుకుంటుందని ఆశిద్దాం.



బసవరాజు నరేందర్‌రావు
9908516549



## ఒక పయనం వెనుక

పక్షి ఎత్తుకు ఎగరడం
ఆనందం అంచులు చూడటం
ప్రకృతి తీరు

వీరులు పోలికల వేగుచుక్కలు
అయినట్టు
విప్పార్చిన హస్తాలతో
ముడిచిన అస్త్రాలతో
వాళ్లు పనుల్లోకి దిగుతారు
సంతోషానికి మార్గాలు
తవ్వుతుంటారు

ఉల్లాస హృదయమో
కష్టపోతు తనమో
నేర్చుకోవడం అనే పోరాటమో
నేర్పించడం అనే ఆరాటమో
అలుపెరుగని శ్రమ తత్వాన్ని రక్తనిష్ఠతో
వాళ్లకు నైపుణ్యాలను తెచ్చిపెట్టింది

వాళ్లే మీ ముందు ఉండేటందుకో
పైపైకి ఎక్కేసేటందుకో కాదు
ఓ వస్త్రంగానో
ఓ వస్తువుగానో
శబ్ద నాదం అవుతారు

వాళ్లు వికసిత నయనాలతో
నేల తవ్విన ప్రతిసారి
బొగ్గు రవ్వలు వాళ్లతో
ముచ్చటిస్తుంటాయి

అందరి మనసుల్లో కొలువుండేందుకో
కొందరి చేతుల్లోనే
కనిపించాలనేందుకో కాదు
సూర్యుని నీడ జారి చెమట చుక్క
అయినప్పుడు
ఆ చూపుల్లోనో
ఆ ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లోనో
ప్రాణవాయువంతటి విలువ
ఉంటుందని వాళ్లకు తెలియదు
చిక్కటి చీకటిలో తెల్లని వెలుగులలో
ఆకాశాన్ని పరుచుకోకముందే
పనుల్లోంచి దిగేసినా
నాలుగు చుక్కలు నోట్లో పడగానే
యుద్ధంలో గెలిచిన సైనికుని ధీమాతో
నిద్ర మత్తుల్లోకి వెళ్తారు

మెలకువ బుద్ధికి ఉండాలనే
మేధావి వర్గానికి
బోలెడంత మెటీరియల్
అందిస్తారే గాని
ఇమ్మెటీరియల్‌గా నడుస్తూ ఉంటారు

పలుగు పార తట్ట చీపుర్లను
చేతబట్టుకొని
వెనుదిరుగని రైలులా
పట్టాలెక్కుతూనే ఉంటారు

వాళ్లు శ్రామికులని పిలవబడుతుంటారు
పిలవబడటమే కాదు
మనందరికీ తెలిసిన కార్మికులూ వాళ్లే

వాళ్ల కోసం
ఒక్క మే డేనేనా?

పన్నెండు ఆకుల కాలానికి
ఇరుసు వాళ్లే చక్రం వాళ్లే!!



డాక్టర్ కొండపల్లి నీహారిణి

# అపర జానపద సంగీత సరస్వతి

**శతాబ్దాల తరబడి మౌఖికంగానే ప్రాచుర్యంలో ఉన్న జానపద సంగీతాన్ని వెలుగులోకి తీసుకువచ్చి జానపద సంగీతానికి స్వరలిపి రాసి, ఆకాశవాణి ద్వారా ప్రసారం చేసి, కచేరీ స్థాయికి తీసుకెళ్లిన తొలి మహిళామణి వింజమూరి (అవసరాల) అనసూయ. 1938లో ఆకాశవాణి ఆరంభమే అనసూయ గాత్రంతో మొదలైంది. తర్వాత వింజమూరి సీతాఅనసూయ అనే పేరు జానపద సంగీతానికే ఒక ఐకాన్‌గా నిలిచింది. అంతేకాదు, లలిత సంగీతానికి కూడా అనసూయనే ఆద్యురాలు. సంగీత సభలోకి భావగీతమనే గాన విధానాన్ని పరిచయం చేసింది కూడా అనసూయే.**



**మే 12న అవసరాల అనసూయదేవి జయంతి**

కాకినాడలో వింజమూరి లక్ష్మీనరసింహారావు-వెంకటరత్నమ్మ దంపతులకు 1920, మే 12న అనసూయ జన్మించారు. ఈమె చెల్లెలే వింజమూరి సీత. వెంకటరత్నమ్మ ప్రఖ్యాత కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి సోదరి. ఆమె 1914-1939 ప్రాంతంలో 'అనసూయ' అనే సాంస్కృతిక మాసపత్రికను నిర్వహించారు. ఇది తెలుగు నాట వెలువడిన తొలి మాసపత్రిక కావడం విశేషం. అనసూయ తన తొమ్మిదో ఏటనే మేనమామ దేవులపల్లి గీతాలకు చక్కని ట్యూన్లు కట్టేవారు. అంతేకాదు, హరీంద్రనాథ ఛటోపాధ్యాయకు సహకరించడం ఆమె ప్రతిభకు నిదర్శనం. 1938లో మద్రాసులో ఆలిండియా రేడియో ప్రారంభించిన రోజున (ఫిబ్రవరి 20) తొలి ప్రసారమైన ముద్దుకృష్ణ రాసిన అనార్కలి నాటికలో 'రారమ్మ రారమ్మ మందారమా' మొదలైన పాటలు పాడిన తొలి రేడియో గాయనిగా ఆకాశవాణి చరిత్రలో అనసూయ పేరు నమోదైంది. 1940లలోనే వింజమూరి అనసూయదేవి తొలితరం సినీ హీరో అవసరాల శేషగిరిరావును వివాహమాడారు.

1941లో ఆకాశవాణి మద్రాసువారు అనసూయ ప్రతిభను గుర్తించి డిగ్రీ చదువుతున్న రోజుల్లోనే నిబంధనలు సడలించి కంపోజర్ ఉద్యోగం ఇచ్చారు. దాంతో అంతవరకు ప్రశాంత గోదావరిలా సాగిన అనసూయ స్వరజీవనం ఉరకలెత్తే గోదావరిగా మారింది. ఆకాశవాణిలో తన చెల్లెలు సీతను సహ గాయనిగా చేసుకున్న తదుపరి 'వింజమూరి సీతా అనసూయ'గా మారి, అశేష శ్రోతలకు, పండిత పామరులకు చి(స్వ)ర పరిచితులయ్యారు.

1947 ఆగస్టు 15న అనసూయ ఆకాశవాణిలో 'స్వాతంత్ర్య రథం' నాటికలో పాడారు. జానపద, లలిత సంగీతానికి అనసూయ చేసిన సేవల గురించి రాయాలంటే ఒక గ్రంథమే అవుతుంది. అనసూయ కృషి వల్లనే 1962లో నాటి సమాచార ప్రసార శాఖమంత్రి బెజవాడ గోపాలరెడ్డి ఆకాశవాణిలో జానపద సంగీత శాఖను ఏర్పాటుచేశారు. 'మొక్కజొన్న తోటలో, కొయ్యోడు, వల్లారి బాబో, ఎయిర సిన్నోడెయిరా, అంతే నాకు చాలు తమలపాకు' మొదలైనవి ఆమె స్వరపరిచిన వేలాది జానపదాలలో కొన్ని. తొలిటాకీల కాలంలోనే అనసూయకు సినిమాల్లోనూ అవకాశాలు వచ్చాయి. 1948 లో బీఎన్ మల్లీశ్వరి చిత్రంలో 'నోముల నోమల్లాల', 'మనసున మల్లెల మాలలూగెనో' పాటలకు ఆమె బాణీలందించారు. 1962లో రాజ్‌కుమార్ నటించిన కన్నడ చిత్రం 'మహాత్మా కబీర్'కు తొలిసారి పూర్తిస్థాయి సంగీత దర్శకురాలయ్యారు. అనసూయ ఉత్తమ రచయిత్రి కూడా. సంగీత సాహిత్యాలపై ఆమె 11 గ్రంథాలు రచించారు. సంగీత ప్రపంచానికి ఎంతో సేవ చేసిన అనసూయ 2019 మార్చి 23న స్వర్గస్థులయ్యారు.

అనసూయ స్వరం అజరామరం. తెలుగు జానపద సంగీతానికి వరం. ఆమె సుదీర్ఘ స్వరజీవన ప్రస్థానంలో అన్యస్వరమే కానీ అపస్వరం లేదు. అసమాన అనసూయగా ఆమె నిరంతరం వెలిగే అవస(స్వ)రాల భాస్వరం.



డాక్టర్ వి.వి.రామారావు
98492 34663



## స్వార్థ రహిత ఆకాశం

అటు చూడకు ముమ్మాటికీ
అది కాలిన పువ్వుల శవాలను తీసుకెళ్లిన దారి
వెన్నెముకలు కోల్పోయిన జీవచ్ఛవాలు తచ్చాడేది
అక్కడ భావోద్వేగాలను అడుక్కునే వారుంటారు
వికృతమైన చేష్టలు చేస్తూ జీవితంపై చాడీలు చెప్తూ
ఒక దిష్టిబొమ్మను తయారు చేస్తారు
పొలాల్లో పచ్చని చెట్లకు నల్లటి రంగు వేస్తూ
కోపంగా మనవైపే చూస్తుంటారు
ముచ్చటించరు చెమటలు తాగుతారు
మన ఆనందాల కాలువలో స్నానాలాడుతారు
ఓ సోదరీ అటు మనం ఎక్కలేని మెట్లు
అవి అమ్ముకున్నవి అక్రమంగా
కొన్ని రాత్రుల నుంచి పడిగాపులు గాచిన కాళ్లకు
రెండో మూడో ఇచ్చి కానిచ్చేస్తారు
మిగిలినవన్నీ అంతే అనుకుంటాం మనం
అసంబద్ధంగా ప్రశ్నార్థకమైన కళ్లు ఎన్నో
పోదామా ఇట్లాగే వెనుదిరుగుదామా
మనకూ ఉన్నాయి కదా కొన్ని స్వార్థపూరిత
సవాళ్లు
వాటి మధ్యలో వీటిని లేపాలి
కొండ ముందు పొట్టేలు లాగా కనీసం
నిలబడదాం రా
ఖాళీ స్థలం చూసుకొని
మన ఒంట్లో నుంచి బరువెక్కిన గాలిని
పోగొట్టుకుందాం రా
అరుద్దాం రా ఆకాశం కేసి కాసేపు..!




వగ్గు రఘువీర్

# తెలుగు కవితకు ఘన నీరాజనం

**సాహిత్యానికి ప్రచురణే ప్రాచుర్యాన్ని తెస్తుంది. పుష్ప సుగంధ పరిమళాల వ్యాప్తికి గాలి తోడైనట్టు అక్షరాలను కాగితాలు మోసుకెళ్తాయి. గాలి పాత్ర పోషించే సాహిత్యాభిలాషుల కృషి ప్రముఖమైనది. వారి శ్రమ వల్ల తెలుగులో ఎన్నో రచనలు సంకలనాలై సాహిత్య చరిత్ర మేడకు ఇటుకలు పేర్చాయి. సంకలనాల రూపకల్పనలో కర్తల తాహతు మేరకు ఫలితాలున్నా ప్రతి పుస్తకం తనదైన పాత్ర పోషిస్తుంది. పుస్తకంలో ఉన్న మేలిమి సమాచారం, దాని క్రోడీకరణలో చూపించిన ప్రజ్ఞ, విద్వత్తు ఆధారంగా సాహిత్యంలో స్థానం నిర్ణీతమవుతుంది.**

దశాబ్దాల సాహిత్యాభిలాష, పఠనం వల్ల చదువరులు కూడా మేధోపరంగా సాహితీవేత్తగా మారిపోతారు. వారిలోనూ ఒక తపన మొదలవుతుంది. కొందరు విశ్లేషకులుగా మారుతారు, కొందరు ఇష్ట రచనల సంకలన కృషికి నడుం కడతారు. ఇలా ఇతరుల రచనలను పల్లకిలో మోయడమనేది నిజంగా సర్వోత్తమ సేవగా భావించాలి. ఈ రెండు పాత్రలూ సాహిత్య వృద్ధికి, విస్తరణకు కొత్త బాటలు వేస్తాయి. రచయితల సొంత పుస్తకాలే ఎక్కువగా వస్తున్న ఈ కాలంలో 'కవన గర్బరాలు' అనే భారీ కవిత్వ సంకలనం వచ్చింది. వెయ్యికిపైగా పేజీలున్న క్రౌన్ సైజు పుస్తకం చూడగానే తెలుగు కవితకు గజమాల గౌరవంగా అనిపిస్తుంది. గర్బరాలు అనే పదం ఒక ప్రయోగం. అది ఒక పూల మొక్క పేరు. గడ్డి జాతికి చెందిన దాన్ని రంగురంగుల్లో పూలు పూసేలా అభివృద్ధి పరిచిన జర్మన్ శాస్త్రవేత్త త్రాగట్ గర్బర్ పేరును దానికి పెట్టారు. ఆ పూల అందాలను ముఖచిత్రంపై చూడవచ్చు. సంకలనంలోని భిన్నకవుల, భిన్న భావాల రచనలకు ప్రతీకగా ఈ పదం వాడారు. ముఖచిత్రంపై '100 సంవత్సరాల సాహిత్య సంపద నుంచి ఏర్చి, కూర్చిన కవితలు, విశ్లేషణలు' అని ఉంది. సంకలనకర్తలు చేపూరు సుబ్బారావు, వీకే ప్రేమ్‌చంద్. వీరిద్దరూ దాదాపు ఎనభై ఏండ్ల వయస్కులు కావడం గమనార్హం. చేపూరు సుబ్బారావు ఆంగ్ల అధ్యాపకులుగా పని చేశారు. కొన్ని అనువాదాలు చేశారు. వీకే ప్రేమ్‌చంద్ అమెరికాలో, భారత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేశారు.



ఈ సంకలనంలో కవుల వరుసను తెలుగు అక్షర క్రమంలో పేర్చారు. వంద మంది కవుల్లో మొదట అడవి బాపిరాజు పేరు రాగా చివరన సౌభాగ్య ఉన్నారు. ఈ విధమైన క్రమసూచిక వల్ల కాలానుగుణ కవిత్వ పరిణామాలు తెలిసే అవకాశం తగ్గిందనుకోవచ్చు. ఈ ప్రయత్నం తెలుగు తొలి కవులైన గురజాడ, మల్లాది, రాయప్రోలుతో మొదలై విశ్వనాథ, విద్వాన్ విశ్వం, జంధ్యాల, శ్రీశ్రీ, పుట్టపర్తి, కాళోజీ, బసవరాజు, సినారె, దాశరథిల మీదుగా కుందుర్తి, అజంతా, అద్దేపల్లి, శివారెడ్డిలను ప్రస్తావిస్తూ.. నేటితరం కవులతో వందకు చేరుకున్నది. సంఖ్యాపరంగా చూస్తే వర్తమాన కవులకు ఎక్కువ చోటు లభించిందనవచ్చు. పేరొందిన కవులే కాకుండా, కవులుగా గుర్తింపు పొందనివారు కూడా ఇందులో ఉన్నారు. తక్కువ రాసినా అందులో మంచి కవితలున్నందున ఇలా ఎంపిక చేసి ఉంటారు. వంద మంది కవుల ప్రసిద్ధ, ఉత్తమ కవితలను ఎంచుకొని కవి పరిచయంతో పాటు ప్రతి కవితకు వివరణ ఇచ్చారు. ఆయా కవులపై, వారి రచనలపై సీనియర్ కవులు, సాహితీవేత్తలు వెలిబుచ్చిన అభిప్రాయాలను జత చేశారు. వీటి సేకరణలో చాలా శ్రమ కూడి ఉన్నది. ఈ సమాచారం కవిత్వంలో కొత్తవారికి, తెలుగు విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయోగపడుతుంది.

సంకలనంలో కర్తల ముద్ర ఉన్నా, భావకవిత్వానికి పెద్దపీట వేసినా వీరి ప్రయత్నం వందనీయం, అభినందనీయం. సాహితీ క్షేత్రంలో ఉండే సంపాదకుల లేమి సంకలన రూపకల్పనలో కనబడుతున్నా వీరి కృషి ముందు వాటిని మరిచిపోవచ్చు. ఎవరో ఒకరు ముందుకురాకపోతే ఇలాంటి బృహత్కార్యాలు సాహితీ సీమకు అందవు. ముదిమిలో ఇంతటి నిర్మాణ భారాన్ని ఎత్తుకున్న సంకలనకర్తలు అటు ప్రభుత్వానికి, ఇటు ఇతర సాహితీ సంస్థలకు ఆదర్శంగా నిలిచారు.



బి.నర్సన్
94401 28169



## ఇటుక ఇటుక ఏమౌతావు..

గుడిగా మారి వేదనాదాన్ని
దశ దిశలా ప్రతిధ్వనింపజేస్తాను!

ఇటుక ఇటుకా ఏమౌతావు!
మసీదుగా కట్టడమై నమాజ్‌తో
లోక క్షేమం కోసం అల్లాను ప్రార్థిస్తాను!

ఇటుక ఇటుకా ఏమౌతావు!
నింగినంటే చర్చినై విశ్వాసంగా ప్రార్థిస్తూ
ప్రేమ తత్వాన్ని పావురాలుగా
ఎగరేస్తాను!

నేను ఇటుకనే అయినా
సర్వమత సమానత్వం
భారతీయత అని
ప్రపంచ హృదయమౌతాను!

చిన్న ఇటుకనే
కానీ మౌనంగా సమస్త మందిరాల
సమస్త ప్రార్థనల సంగమ పుణ్యక్షేత్రాన్ని!



కందాళై రాఘవాచార్య
87905 93638

## ఆహ్వానం

### జీవజలం సాహిత్య సభ

2024, మే 18 శనివారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చలం సాహిత్య స్మారకోపన్యాస సభ జరుగనున్నది. 'చలం మ్యూజింగ్స్- వస్తు రూపాలు' అంశంపై డాక్టర్ కాత్యాయనీ విద్మహే, డాక్టర్ సి.మృణాళిని ప్రసంగిస్తారు. చలం మ్యూజింగ్స్‌లోని కొన్ని భాగాలను సీహెచ్ ఉషారాణి, మెర్సీ మార్గరేట్, జ్వలిత, కొల్లాపురం విమల, కొండపల్లి నీహారిణి, ఐనంపూడి శ్రీలక్ష్మి, వాసరచెట్ల జయంతి చదువుతారు. చలం మ్యూజింగ్స్‌పై మామిడి హరికృష్ణ మాట్లాడుతారు. అందరికీ ఆహ్వానం.

– నాళేశ్వరం శంకరం, కన్వీనర్, చలం భావన

### 'జాబిల్లి పుష్పం' ఆవిష్కరణ

2024 మే 19 ఆదివారం సాయంత్రం గుంటూరు, బృందావన్ గార్డెన్స్‌లోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో డాక్టర్ రవూఫ్ రాసిన 'జాబిల్లి పుష్పం' కవితా సంపుటి ఆవిష్కరణ జరుగనున్నది. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులు డాక్టర్ సి.భవానీదేవి అధ్యక్షతన జరిగే ఈ సభలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పుస్తకావిష్కరణ చేస్తారు. ప్రముఖ కవి ప్రసాదమూర్తి పుస్తకాన్ని సమీక్షిస్తారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, కాట్రగడ్డ దయానంద్ పాల్గొంటారు. అందరికీ ఆహ్వానం.

– చలపాక ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

### గ్రంథం ఆవిష్కరణ సభ

2024 మే 14న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జాలాది రత్న సుధీర్ రాసిన 'అమ్మ చెక్కిన శిల్పం' హిందీ అనువాదం 'మా తుఝే నమన్' పుస్తక ఆవిష్కరణ సభ జరుగనున్నది. ఈ సభకు సీఎస్ రాంబాబు అధ్యక్షత వహించనుండగా, ఆవిష్కర్తగా ఏనుగు నరసింహారెడ్డి వ్యవహరిస్తారు. అనువాదకుడు లక్ష్మణాచార్యులు, డాక్టర్ రూప్‌కుమార్ డబ్బీకార్, డాక్టర్ సురభీ లక్ష్మీ శారద, గోవింద్ అక్షయ్, దీపక్ చిండాలియా ప్రసంగించనున్నారు.

– గుడిపాటి, పాలపిట్ట బుక్స్